సుందరీకరణ.. శరవేగం..!

• రూ.10కోట్లతో నియోజకవర్గంలో పనులు • గాజులరామారం,కుత్బుల్లాపూర్ సర్కిళ్లలో చెరువులు, పార్కుల అభివృద్ధి • కొన్నిచోట్ల పూర్తి..మరికొన్ని చోట్ల తుదిదశకు..


మహాదేవ్‌పురం వద్ద..



జగద్గిరిగుట్ట: నియోజకవర్గంలో చేపట్టిన పలు సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్లకు రూ. 10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇందులో కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు సంబంధించి రూ. 2.70 లక్షలు, గాజులరామారం సర్కిల్‌కు రూ. 7 కోట్లకు పైగా నిధులు కేటాయించారు. ఆయా నిధులతో 2 నెలల క్రితం ప్రారంభించిన చెరువులు, పార్కులు, తదితర అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి.

కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో..

◆ రూ. 40 లక్షలతో అల్లం చెరువు చుట్టూ సుందరీకరణ పనులు పూర్తి చేశారు.

◆ రూ. 1.50 లక్షలతో 130, 132 డివిజన్లలోని ఎన్‌సీఎల్, రుక్మిణి ఎన్‌క్లేవ్, బృందావన కాలనీ, సుభాష్‌నగర్‌లో పార్కుల అభివృద్ధి పనులు చేపట్టగా దాదాపు 70 శాతం వరకు పూర్తయ్యాయి.

◆ రూ. 80 లక్షలతో మహానగర్, గోదావరి హోమ్స్, వుడ్స్‌కాలనీల్లో పార్కుల సుందరీకరణతో పాటు వాటిలో జిమ్ పరికరాలు అమరుస్తున్నారు. ఇక్కడ కూడా పనులు తుదిదశకు చేరుకున్నాయి.

గాజులరామారం సర్కిల్‌లో ..

◆ రూ. 1.55 లక్షలతో శ్రీవెన్ ఎన్‌క్లేవ్, ఉషోదయ కాలనీల్లోని పార్కులో పిల్లలకు ఆట వస్తువులతో పాటు, వాకింగ్ ట్రాక్, వాలీబాల్ కోర్టు, ఓపెన్ జిమ్‌తో పాటు సుందరీకరణ పనులు చేపడుతున్నారు.

◆ రూ.90 లక్షలతో ఆర్‌కే లేఅవుట్ లో స్కేటింగ్, మల్టీ పర్పస్ కోర్టు పనులతో పాటు సుందరీకరణ పనులు 75 శాతం పూర్తయ్యాయి.

◆ రూ. 3 కోట్లతో టీఎస్ఐఐసీ కాలనీలో సుందరీకరణతో పాటు బ్యాట్మింటన్ కోర్టు, రెస్ట్ రూమ్స్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నారు.

◆ రూ. 1.10 లక్షలతో షిరిడీ హిల్స్, బాలాజీ లేఅవుట్ పార్క్‌లో సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి.


కుత్బుల్లాపూర్ సర్కిల్ ఆర్టీఏ ఆఫీస్ సమీపం అల్లం చెరువు వద్ద..


అల్లం చెరువు వద్ద..


గాజులరామారం సర్కిల్
షిరిడీ హిల్స్, మహాదేవ్‌పురం వద్ద..

ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

కుత్బుల్లాపూర్: గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల కార్యాలయంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై విభిన్న ప్రతిభావంతులను సత్కరించారు. అలాగే విభిన్న ప్రతిభావంతుల పొదుపు సంఘాల మహిళలకు చెక్కులు, ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, డీపీఓలు హిమబిందు, హరిప్రియ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ పాలేరుకి మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం వంద కోట్ల రూపాయలను మంజూరు చేయటం పట్ల పాలేరు కళాశాల నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి. రవీందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ డాక్టర్ వి. వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి యూనివర్సిటీ రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావులకు మంగళవారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. భవన నిర్మాణం, రీసెర్చ్ సెంటర్, ఇతర మౌలిక వసతులను కల్పించడం కోసం రూ.108.60 కోట్ల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ పెద్దలకు, యూనివర్సిటీ మాజీ వీసీ బుర్రా వెంకటేశంకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. ఇందులో ప్రధానోపాధ్యాయురాలిగా బిందుశ్రీ, విద్యాశాఖ మంత్రిగా అమృతవల్లి, ప్రిన్సిపాల్ సెక్రటరీగా సువర్ణ, విద్యాశాఖ కార్యదర్శిగా జీవిత, కలెక్టర్‌గా అంజలి, జిల్లా విద్యాధికారిగా అన్నూక్ రావు, మండల విద్యాధికారిగా మహాలక్ష్మి తమ విధులను నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యార్థులు తాము పాఠశాల నిర్వహణలో పొందిన అనుభవాన్ని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి, ఏఎంఓ రవీందర్ రాజు, ఎంఈఓ కిషన్, ఉపాధ్యాయులు శంకరప్ప, దమయంతి, కుసుమ, మల్లారెడ్డి, రామ్మోహన్ రావు, తుల్జారాం, దామోదర్ రెడ్డి, గోపాల కృష్ణ, సత్యనారాయణ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, గాయత్రి, శ్వేత రెడ్డి, శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ శివానగర్‌లో రూ. 65 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని పేర్కొన్నారు.ప్రజా సంక్షేమం కోసం పని చేసే నాయకులకు ప్రజల ఆశీర్వాదం ఎప్పుడూ ఉంటుందని, అందుకే తనను మూడోసారి అఖండ మెజార్టీతో గెలిపించారని, ఇక్కడి ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఇప్పటికే దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయని ఇంకా ఏమైనా మిగిలి ఉంటే ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, నాయకులు బాబు గౌడ్, శశిధర్, బ్రహ్మానంద చారి, మల్లేశ్ గౌడ్, పాపిరెడ్డి, బస్తీవాసులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం 'సీఎంఆర్‌ఎఫ్'


చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంలాంటిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో నరసింహారెడ్డి, కృష్ణకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.60 వేలు, రూ.52.500 చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో కుత్బుల్లాపూర్ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ డిపార్ట్‌మెంట్ కాంగ్రెస్ స్టేట్ కోఆర్డినేటర్ భరత్‌గౌడ్, సంజీవ్ కుమార్, లక్ష్మణ్, యువరాజ్, వెంకటస్వామి, భాస్కర్, మహేశ్ తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత శిక్షణ ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ: ఆర్యవైశ్య పితామహుడు, మాజీ సీఎం, దివంగత కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం సీల్ వెల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ల శిక్షణా కేంద్రాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ బండారు సుబ్బారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో బుధవారం కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని వాచ్‌మెన్ మృతి

కేపీహెచ్‌బీకాలనీ: టిప్పర్ ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ కంపెనీ వాచ్‌మెన్ మృతి చెందాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజుల రామారం ప్రాంతంలో నివాసం ఉండే సలేగా రమేష్ (43) గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం తన ద్విచక్ర వాహనంపై నైట్ డ్యూటీకి వెళ్లి విధులు ముగించుకుని మంగళవారం తెల్లవారుజామున ఇంటికి వెళ్తున్నాడు. కేపీహెచ్‌బీకాలనీ ఆల్మండ్‌స్వీట్ హౌస్ వద్ద గల యూటర్న్ వద్ద అకస్మాత్తుగా టిప్పర్ మూలమలుపు తిరిగి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. రమేష్ టిప్పర్ వెనుక చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ఏఈగా యశ్వంత్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నూతన ఏఈగా యశ్వంత్ మంగళవారం బాధ్యత స్వీకరించారు. కాగా ఇక్కడ ఏఈగా విధులు నిర్వహించిన బలరాంనాయక్‌ను లంచం తీసుకుంటుండగా అవనీతి నిరోధకశాఖ అధికారులు నేరుగా పట్టుకున్నారు. దీంతో సీఎండీ కార్యాలయంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న యశ్వంత్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన ఏఈ మాట్లాడుతూ.. ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానన్నారు.

యథేచ్ఛగా రోడ్ల ఆక్రమణ..!

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు అంతర్గత రోడ్లను కొందరు ఇళ్ల యజమానులు, పరిశ్రమల నిర్వాహకులు ఆక్రమించి సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. సంజయ్‌గాంధీనగర్‌లోని హిందూ శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో ఓ వ్యక్తి తన ఇంటి ముందు రోడ్డును ఆక్రమించి ఏకంగా వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మార్చుకున్నాడు. అలాగే సంజయ్‌గాంధీనగర్-గాంధీనగర్ రోడ్డులో ఓ ఇంజినీరింగ్ పరిశ్రమ యజమాని తన ఫ్యాక్టరీ ఎదుట రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. ఈ విషయమై స్థానికులు సంబంధిత ధికారుల దష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి రోడ్డు ఆక్రమణలు తొలగించి రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


సంజయ్‌గాంధీనగర్‌కు వెళ్లే రోడ్డును ఆక్రమించి పార్కింగ్‌కు ఉపయోగిస్తూ..


గాంధీనగర్-సంజయ్‌గాంధీనగర్ రోడ్డుపై వేసిన ఫెన్సింగ్

వ్యాపార భాగస్వాముల డ్రైవర్లే సూత్రధారులు

- కూకట్‌పల్లి చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- రూ.50 లక్షల విలువైన సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కే సురేశ్‌కుమార్

జీడిమెట్ల: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనాన్ని కూకట్‌పల్లి పోలీసులు ఛేదించారు. డ్రైవర్లే సూత్రధారులుగా గుర్తించి ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ కే సురేశ్‌కుమార్, క్రైం డీసీపీ నరసింహ, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస రావు, సీసీఎస్ ఏసీపీ కళింగరావు, కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ముత్తుతో కలిసి మంగళవారం వివరాలు వెల్లడించారు. కూకట్‌పల్లిలోని జయనగర్‌కు చెందిన కూమని మధుసూదన్‌రావు గత నెల 28న ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి మియాపూర్‌లో ఉండే పెద్ద కుమార్తె ఇంటికి వెళ్లారు. తర్వాత రోజు ఉదయం వారుండే అపార్టుమెంట్ వాచ్‌మెన్ మధుసూదన్‌రావుకు ఫోన్ చేసి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని సమాచారం అందించాడు. వెంటనే ఇంటికి చేరుకున్న మధుసూదన్‌రావు బీరువా తెరిచి చూడగా 80 తులాల నగలతో పాటు 157 గ్రాముల వెండి రూ.2 లక్షలు కనిపించలేదు. దీంతో మధుసూదన్‌రావు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

◆ సుమారు 200 సీసీ కెమెరాల ఫుటేజీలను 2 రోజుల పాటు తీవ్రంగా పరిశీలించగా దొంగతనానికి పాల్పడింది మధుసూదన్‌రావు వ్యాపార భాగస్వాముల డ్రైవర్లేనని పోలీసులు ఆధారాలు సేకరించారు. అనంతరం వివేకానందనగర్‌లో ఉండే డ్రైవర్లు సంపంగి లక్ష్మణ్ (44), కూకట్‌పల్లికి చెందిన గుమ్మడి నాగశంకర్ (23) అదేప్రాంతానికి చెందిన గుమ్మడి శంకర్(23) దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాకు చెందినవారే. వీరి నుంచి పోలీసులు 80 తులాల బంగారు నగలు, వెండి సామాగ్రి, రూ.2 లక్షలను స్వాధీనం చేసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన కూకట్‌పల్లి డీఐ బీ.వెంకటేశం, ఎస్ఐలు సతీశ్‌రెడ్డి, సీహెచ్. రాజు, పోచయ్య, గిరీశ్‌ను డీసీపీ అభినందించారు.

లేక్‌పార్క్ పనుల పరిశీలన

మల్కాజిగిరి: సఫిల్‌గూడ లేక్‌పార్క్ సుందరీకరణ పనులను కార్పొరేటర్ శ్రవణ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.40 లక్షలతో ఎంట్రన్స్ ఆర్చ్‌తో పాటు పార్కు లోపల పనులు జరుగుతాయన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తిచేయాలని ఇంజినీరింగ్ విభాగం ఈఈ లక్ష్మణ్‌కు సూచించామన్నారు. పనులు పరిశీలించాల్సిన డీఈ మహేష్ హాజరుకాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మేయర్‌తో పాటు అప్పటి కమిషనర్ ఆమ్రపాలి నోడల్ ఆఫీసర్‌గా మహేష్‌కు అప్పగించారని, వారు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఏఈ నవీన్, వీఐ రమేష్ పాల్గొన్నారు.

నీటి బకాయిలు మాఫీ చేయాలని వినతి


కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకుడు కృష్ణారెడ్డి తదితరులు

దుండిగల్: ప్రజలకు పెనుభారంగా ఉన్న తాగునీటి బకాయిలు మాఫీ చేయాలని బీజేపీ నాయకుడు పీసరి కృష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు భౌరంపేట్ పరిధిలో అధిక నీటి బిల్లులు, తాగునీటి కొరతపై మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ 2019లో పంచాయతీ నుంచి మున్సిపల్ పరిధిలోకి వచ్చిన భౌరంపేట్‌లో తాగునీటి సప్లై బిల్లులు, మెయింటనెన్స్‌ను మెట్రో వాటర్ వర్క్స్ ఆధీనంలోకి తీసుకున్నారన్నారు. గ్రామపంచాయతీలో రూ.20 ఉన్న బిల్లు ఒకేసారి రూ.250 పెంచారని, అది కూడా వారం రోజులకు ఒకసారి మాత్రమే నీటిని సరఫరా చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేగాకుండా 30 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లు కావడంతో పలు చోట్ల పగిలిపోయి నీరు వృథాగా పోతోందన్నారు. దుండిగల్, నాగులూరు, గాగిల్లాపూర్, శంబీపూర్ ప్రాంతాలకు ఉచితంగా తాగునీటిని అందిస్తున్నారని, అదే మున్సిపాలిటీలో ఉన్న భౌరంపేట్, మల్లంపేట్, బహదూర్‌పల్లి, డిపోచంపల్లి గ్రామాలకు మాత్రం బిల్లులు వేస్తున్నారని , ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. బకాయి నీటి బిల్లులను మాఫీ చేసి సరిపడా నీటిని సరఫరా చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఆయన వెంట గోనె మల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నల్ల రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ


దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న విజయ్ కుమార్, మమ్మద్ మతిన్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దుమ్‌నగర్, అశోక చక్ర దివ్యాంగుల సంక్షేమ సంఘంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హార్ట్ సొసైటీ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మమ్మద్ మతిన్ గారి సహకారంతో ముగ్గురు దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అశోక చక్ర దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏసుబాబు, మదర్ థెరిస్సా ఫౌండేషన్ అధ్యక్షులు శ్రావణ్ కుమార్, బాబురావు, అరుణ్ కుమార్, శంకర్, శ్రీనివాస్ రెడ్డి, వరప్రసాద్, గోపాల్, విజయ, రమా, రేఖ, లలిత తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!


చంద్రానగర్‌లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్

చింతల్: చింతల్ డివిజన్ చంద్రానగర్‌లోని రోడ్డు నంబర్-2 లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కేబుల్ వైర్ల ఇన్సులేటర్ ఊడిపోయి ప్రమాదకరంగా మారింది. కాగా ఈ రోడ్డుగుండా విద్యార్థులు, బస్సులు నిత్యం వెళ్తుంటారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏదైనా జరిగితే ఎలా అంటూ విద్యుత్ అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని భగత్‌సింగ్‌నగర్ సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న కేబుల్ వైర్లను తొలగించి నూతన వైర్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

డంప్‌యార్డులో మంటలు.. ప్రజల ఉక్కిరిబిక్కిరి


బాచుపల్లి డంపింగ్‌యార్డులో వ్యాపించిన పొగలు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి డంపింగ్ యార్డులో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టారు. దీంతో మధ్యాహ్నం నుంచి మంటలు ఎగసిపడి దట్టమైన పొగలు వ్యాపించగా చుట్టు పక్కల కాలనీలు, బస్తీవాసులు ఉక్కిరి బిక్కిరయ్యారు. తరచూ చెత్తకు నిప్పు పెట్టడంతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యాల బారిన పడుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డంప్‌యార్డును తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో జట్ల ఎంపిక

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ఆల్ ఇండియా రెజ్లింగ్ మెన్ అండ్ ఉమెన్ జట్లను, సౌత్ జోన్ హాకీ పురుషుల జట్టును మంగళవా రం ఎంపిక చేశారు. సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో ఎంపిక జరిగింది. హాకీ జట్టు చీఫ్ సెలెక్టర్, ఇండియన్ టీం మాజీ కోచ్ పెరుమల్ మధుకరన్ పర్యవేక్షణలో జట్లను ఎంపిక చేశారు. జనవరి 5 నుంచి 8 వర కు గురుకాశీ యూనివర్సిటీ, పంజాబ్‌లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీలో రెజ్లింగ్ జట్టు పాల్గొననుందన్నారు. అదే విధంగా జన వరి 14 నుంచి 18 వరకు జరిగే యూనివర్సిటీ మెన్ ఛాంపియన్‌షిప్‌లో రెజ్లింగ్ మెన్ జట్టు పాల్గొననుందని తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో జరిగే సౌత్ జోన్ హాకీ మెన్ ఛాంపియన్‌షిప్‌లో జేఎన్‌టీయూ జట్టు పాల్గొననున్నట్లు ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్ తెలిపారు.

మంచి నిర్ణయాలతోనే ప్రజాపాలన సాధ్యం


నిజాంపేట్‌లో కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నప్పుడే ప్రజాపాలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్లు, నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల పరిధిలో మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. నిజాంపేట్‌లో జరిగిన కార్యక్రమంలో మేయర్ నీలారెడ్డితో కలిసి ఆయన పాల్గొని కార్మికులకు పీపీఈ కిట్లను పంపిణీ చేశారు. అలాగే కొంపల్లి మున్సిపల్ పరిధిలో చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో కార్మికులకు వైద్య శిబిరం, ఉత్తమ సేవలందిస్తున్న సిబ్బందిని సత్కరించారు. రంగారెడ్డినగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి హాజరయ్యారు.

దుండిగల్ మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో..

దుండిగల్: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా దుండిగల్ మున్సిపల్ అధికారులు 'అర్బన్ డే' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు దుండిగల్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ నుంచి 2కే రన్ నిర్వహించగా స్థానికులు, అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక బృందాలకు రూ.3.42 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు, రెవెన్యూ ఆఫీసర్ ప్రభాకర్, మున్సిపల్ ఇంజినీర్ సురేందర్ నాయక్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి సాత్విక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచందర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


రంగారెడ్డినగర్‌లో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి


చింతల్ డివిజన్ వల్లభాయ్‌పటేల్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ..


కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు ఉచిత వైద్య శిబిరం



2కే రన్‌ను నిర్వహిస్తున్న దృశ్యం